క్లుప్తంగా

ఈరోడ్డుపై ప్రయాణం ఎలా..!



మేడివాడ వద్ద గోతిలో కూరుకుపోయిన లారీ

రావికమతం : మండలంలో మేడివాడ నుంచి గర్నికం వరకు ప్రయాణం చేయాలంటే వాహనదారులు తరుచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బాగులేక మేడివాడ నుంచి ప్రయాణం చేస్తుండగా వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోతున్నాయి. బుధవారం మేడివాడ వద్ద లారీ గోతిలో ఉండిపోవడంతో గంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. జెసీబీని రప్పించి లారీని బయటకు లాగారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డు వేస్తామని ఎమ్మెల్యే రాజు హామీ ఇచ్చారు. కానీ రోడ్డు పరిస్థితి మారలేదని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్

రోలుగుంట : మధ్యాహ్న భోజన పథకం అమలులో విధిగా మెనూ పాటిస్తున్నట్టు కొండపాలెం పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్ తెలిపారు. పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులు వెజిటబుల్ పలావు తయారు చేసి, గుడ్డు, చెక్కీ విద్యార్థులకు అందించారు. అంతకుముందు హెచ్‌ఎం వంటలను రుచి చూసి నాణ్యత పరిశీలించారు. 40 మంది విద్యార్థుల రోల్‌కు బుధవారం 38 మంది విద్యార్థులు భోజనం చేశారు.

19 మంది విద్యార్థుల చేరిక



కె.కోటపాడు పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కె.కోటపాడు : కె.కోటపాడు ప్రాథమిక పాఠశాలలో 19 మంది విద్యార్థులు బుధవారం చేరారు. పాఠశాలలో 1వ తరగతికి 8 మంది చేరగా మిగిలిన రెండు నుంచి ఐదు తరగతులకు 11 మంది విద్యార్థులు చేరినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరడం జరిగిందని, పాఠశాలలో సదుపాయాలు, విద్యా బోధన పట్ల తీసుకుంటున్న శ్రద్ధను వివరించి విద్యార్థులను చేర్పించడం జరిగిందని ఉపాధ్యాయుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరరావు, రేవతి, శివలక్ష్మి పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో అప్పారావు

మాకవరపాలెం : విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించవచ్చని ఏవో డి.అప్పారావు రైతులకు సూచించారు. మండలంలోని బూరుగుపాలెం, తూటిపాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు కావాల్సిన రకాల వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తనాల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువును వినియోగించడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు.

ప్రధాన రహదారిపై గోతుల పూడ్చివేత



రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : కృష్ణదేవిపేట-నర్సీపట్నం ప్రధానరోడ్డు మార్గంలో పూర్తిగా మరమ్మతులకు గురైన ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. ఈ మార్గంలో ఆరిల్లోవ అటవీప్రాంతంలో రెండుచోట్ల, గొలుగొండ, లింగంపేట వద్ద భారీగా ప్రధానరోడ్డుపై గోతులు పడ్డాయి. వాహనదారుల ఇబ్బందుల దృష్ట్యా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నామని ఆర్‌అండ్‌బీ జేఈ ప్రసాద్ తెలిపారు.



భూ రికార్డులు సరిచేయాలని బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు



తప్పుగా నమోదు చేసిన భూ రికార్డులను చూపుతున్న రైతులు

అధికారుల తప్పిదం
రైతులకు శాపం

- భూముల రీ సర్వేలో రికార్డుల్లో తప్పుగా నమోదు
- పలువురి ఆధార్ నంబర్లు, సర్వే నంబర్లలో తప్పిదాలు
- అన్నదాత సుఖీభవ పథకానికి నోచుకోని వందలాది మంది రైతులు
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- ఆందోళనలో చిన్న, సన్నకారు అన్నదాతలు



సాగు చేస్తున్న తమ భూముల వివరాలు తెలుపుతున్న రైతులు

బుచ్చెయ్యపేట : రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరుగుతుంది. రైతుల జిరాయితీ భూముల సర్వేలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రైతుల భూ సర్వే నంబర్లు, ఆధార్ నంబర్లు తప్పుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. భూములన్నా సరైన రికార్డులు చూపని కారణంగా వందలాది మంది రైతులకు ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వంలో రైతు భరోసా నగదు అందుకున్న రైతులు నేడు కూటమి ప్రభుత్వంలో మాత్రం అన్నదాత సుఖీభవ డబ్బులు అందడం లేదు. సర్వే చేసినపుడు రైతులు తమ ఆధార్‌కార్డులు, భూ పాసు పుస్తకాలు అందించిన వీఆర్వో, సర్వేయర్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పుగా రికార్డులు తయారు చేశారు. ఆధార్ నంబర్లు, ఒకరి భూములు ఇంకొకరి పేరున, సర్వే నంబర్లు, భూ కొలతలను తప్పుగా నమోదు చేశారు. తప్పులను సరి చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రాజాం గ్రామ రైతులు ఆవేదన చెందుతున్నారు. రీ సర్వేలో జరిగిన తప్పులను సరి చేస్తామని కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత రెండుసార్లు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన రెవెన్యూ అధికారులు సరిచేయలేదు. పలుసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి తప్పులు దొర్లిన భూ రికార్డులను సరిచేయాలని వేడుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని రాజాం గ్రామ రైతులు ఆగ్రహం చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు భూ రికార్డులను సరిచేసి అన్నదాత సుఖీభవ పథకం అందేలా చేయకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద టెంట్ వేసి ధర్నాకు దిగుతామని రా జాం గ్రామ రైతులు తెలియజేస్తున్నారు. రాజాం, తురకలపూడి, మల్లాం, చిట్టియ్యపాలెం, ఆర్. భీమవరం, పెదపూడి, శివరాంపురం తదితర గ్రామాల్లో వందలాది రైతులు భూములు రికార్డులు తప్పుగా నమోదయ్యాయి.

ఆధార్ తప్పుగా నమోదు చేశారు..



నాకు మా రాజాం గ్రామంలో సర్వే నెంబర్ 331-14, 331-13,331-22లో 1.30 ఎకరాల భూమి ఉంది. గత ప్రభుత్వంలో రైతు భరోసా అందుకున్నాను. రీ సర్వేలో నా ఆధార్ నంబర్ తప్పుగా నమోదు చేశారు. దీంతో నాకు అన్నదాత సుఖీభవ పథకం రాదని వ్యవసాయశాఖ అధికారులు చెప్పి ఆధార్ నంబర్ సరిచేసుకుంటే పథకం అందిస్తామన్నారు. రెవెన్యూ అధికారులను పదిసార్లకు పైగా కలిసి ఆధార్ నంబర్ మార్చమన్నా మార్చడం లేదు.

– ఏడువాక అప్పలనాయుడు, రాజాం రైతు

రికార్డులు సరిచేయాలి



మా గ్రామంలో సుమారు మూడువేల మంది రైతులుండగా రీ సర్వే చేసినపుడు వీఆర్వో ముత్యాలు రైతుల భూముల సర్వే నంబర్లు, ఆధార్ నంబర్లు తప్పుగా నమోదు చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత భూ రికార్డులను సరి చేస్తామన్నారు. రామాలయం వద్ద రెండుసార్లు రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించినా సరి చేయలేదు. బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్న, సన్నకారు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందడం లేదు. భూ రికార్డులు సరిచేయకపోతే టెంట్ వేసి ధర్నాకు దిగుతాం.

– జిత్రిపోతుల చిన్నంనాయుడు, రైతు సంఘ నాయకుడు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో-1 సిహెచ్ ఉమ, మహిళా పోలీస్ ఎస్‌కె మీరాబీ

దేవరాపల్లి : మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి-1, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.ఉమ సూచించారు. ఈ మేరకు ప్రతి ఏటా జూన్ 26న నిర్వహించే అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరాపల్లి సచివాలయం-2 మహిళా పోలీస్ ఎస్‌కె. మీరాభి సమక్షంలో బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ ఎస్.కె. మీరాబీ మాట్లాడుతూ డ్రగ్స్ బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ వాడకంతో శారీరక, మానసిక అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుందని విద్యార్థులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.రాములమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నియంత్రించండి

రోలుగుంట : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొమరవోలు గ్రామంలో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సూపర్‌వైజర్ హేమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక అంగన్ వర్కర్లు, చిన్నారులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేశారు. మత్తుకు దూరంగా ఉండాలి -బంగారు భవిష్యత్తును ఏర్పరుచుకోవాలి, పాఠశాలలకు వస్తున్న వస్తున్న విద్యార్థులకు చిన్ననాటి నుంచి మంచి నడవడిక అలవాటు చేయాలి, దుర్వ్యసనాలకు దూరంగా ఉంచాలంటూ పలు నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం సూపర్‌వైజరు హేమ గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర వాటికి అలవాటు పడి నాశనమైన ఎంతో మంది విద్యా మేధావుల గురించి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, ఆనంత, జయ, ఉపాధ్యాయులు, చిన్నారులతో మాదక ద్రవ్యాల నియంత్రణ తమ బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు.



కొమరవోలులో ప్రతిజ్ఞ చేస్తున్న సూపర్‌వైజర్ హేమ, టీచర్లు, చిన్నారులు

బుచ్చెయ్యపేట : మానవ జీవితాలను బుగ్గి పాలు చేస్తున్న మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఐసీడీఎస్ పీవో మంగతాయారు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినం సందర్భంగా వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలు తీసికోవడం వల్ల మనిషి జీవితం ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు మనశ్శాంతి లేక కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుందని పీవో తెలిపారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలను వ్యతిరేకించాలని ప్రతిజ్ఞ చేయించారు. వడ్డాది హెచ్‌ఎం దేవుడమ్మ, పలు గ్రామాల ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రావికమతం : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.కె.గౌహర్ ఉన్నిషా అన్నారు. ఈ నెల 26 అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తకోట హైస్కూల్లో విద్యార్థులకు గౌహర్ ఉన్నిషా, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజ్ కుమార్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ ఉన్నిషా, తదితరులు



వడ్డాదిలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

వర్షాలకు నదులు, కాలువల్లో చేరుతున్న నీరు



వర్షాకు తాచేరు నదిలో చేరిన వర్షపు నీరు



బురదమయంగా మారిన కె.జె.పురం జంక్షన్ వద్ద రహదారి

మాడుగుల రూరల్ : మృగశిర కార్తె పోయి, ఆరుద్ర కార్తె రావడంతో పాటు ఆడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వరినారు మడులు సిద్ధం చేశారు. వరి విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో ముమ్మరంగా రిజిస్ట్రేషన్ జరుగుతోంది. అయితే కొన్ని రకాల విత్తనాలు మాత్రమే రావడంతో కావలసిన విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కురుస్తున్న వర్షాలకు తాచేరు, శారదానది, పెద్దేరు, పాలగెడ్డలో వర్షపు నీరు చేరింది. కాలువలు, గెడ్డలు, చెరువుల్లో కూడా బాగా నీరు చేరింది.

వర్షాలకు రహదారులు ఛిద్రం

వర్షాలకు రహదారులు పూర్తిగా ఛిద్రమైనాయి. వడ్డాది నుంచి పాడేరు వెళ్లే రహదారి నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణం నరకంగా మారింది. పలుచోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. అయితే పనులు వేగవంతం కావడం లేదు. దీంతో బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రహదారితో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే రహదారులు శిథిలావస్థకు చేరాయి. వడ్డాది నుంచి ఇటు చోడవరం, అటు నర్సీపట్నం రహదారి కూడా శిథిలావస్థకు చేరింది. శిథిలమైన రహదారి గుండా ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలి



కె.జె.పురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ వెంకటరావు

మాడుగుల రూరల్ : వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని మండలాల్లోను, గ్రామాల్లోను ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ వి.వెంకటరావు తెలిపారు. కె.జె.పురం కాలనీలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బి.నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరావు జెండా ఆవిష్కరణ కార్యక్రమంతో పాటు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని జూలై 7న పండగ వాతావరణంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. మాదిగ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ఎ.రవికుమార్, సంపూర్ణ, ఎలకా మాలిబాబు, ఎం.ఎం.దాసు, కండిపల్లి వెంకటరావు, మోర్తా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు అభినందన



విద్యార్థిని పూజిత రాణికి స్వీట్ తినిపిస్తున్న హెచ్‌ఎం పాత్రుడు

నాతవరం : ఎం.బి.పట్నం హైస్కూల్‌కు చెందిన కె.పూజిత రాణి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యింది. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు ఆ విద్యార్థినిని అభినందించారు. హెచ్‌ఎం పాత్రుడు విద్యార్థిని రాణికి స్వీట్‌ను తినిపించారు. ట్రిపుల్ ఐటీలో మరింత బాగా చదివి తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఎంసీ కమిటీ చైర్మన్ వెంకటరజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గంటి రోహిత్

దేవరాపల్లి : ట్రిపుల్ ఐటీకి దేవరాపల్లి మండలానికి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన తిమిరాంకు చెందిన గుంపాన ఉదయకుమార్ టెన్త్‌లో 590 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పెనగంటి రోహిత్ టెన్త్‌లో 572 మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. కాగా ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఇద్దరు విద్యార్థులను ఎంఈవో-1 సిహెచ్.ఉమ, ఎంఈవో-2 వి.ఉషారాణి, స్థానిక హెచ్‌ఎంలు అభినందించారు.



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

చోడవరం: మండలంలో లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌లో చదివిన నలుగురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీలో సీటు దక్కించుకున్నారు. గతేడాది కూడా ఈ పాఠశాల నుంచి నలు గురు విద్యార్థు లు ట్రిబుల్ ఐటీలో సీట్లు దక్కించుకోగా ఈ ఏడాది కూడా నలుగురు విద్యార్థులు జనపరెడ్డి హేమలత, జొన్నాడ యశ్వశ్రీ, వీరమల్ల గుణకీర్తి, పాతాలం హర్షవర్ధన్ సీట్లు సాధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.యేసుదాసును, ఉపాధ్యాయులను, ఎంపికై న విద్యార్థినులను, సర్పంచ్ శిరుచోళ్ల గణపతి నాయుడు, విద్యాకమిటీ చైర్మన్ బి. నర్సింగరావు, మాజీ ఎంపీపీ నానికుమార్, అభినందనలు తెలిపారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

- సేవలు బంద్
- సమ్మె ఒప్పందాల్ని అమలు చేయాలని డిమాండ్



ఆర్డీవో కార్యాలయం వద్ద దీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

నర్సీపట్నం : సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టడడంతో రోజువారీ సేవలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్నా ఇచ్చిన హామీలను విస్మరించింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మికులు నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో బుధవారం నుంచి సమ్మెబాట పట్టారు. సమ్మె కొనసాగిస్తూనే ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలోని 45 మంది ఎలక్ట్రికల్, ప్లంబ్లింగ్, వాటర్ వర్క్స్, అటెండర్స్ సేవలు నిలిచిపోయాయి. 2023 డిసెంబర్‌లో జరిగిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.75 వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలకు పెంపు, దహన సంస్కారాల ఖర్చులు రూ.20 వేలు, రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం వంటి అంశాలు, పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని తక్షణం అమలు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టారు.

ఇవీ ప్రధాన డిమాండ్లు..

సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి. రిటైర్‌మెంట్, చనిపోయినా, ఆనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి. ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి. గ్రాట్యుటీ అమలు చేయాలి. చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలి. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి. గ్రాట్యుటీతో పాటు కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలి.

సమాన పనికి సమాన వేతనం..



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. చాలీచాలని వేతనంతో ఇబ్బంది పడుతున్నాం. కొన్నేళ్లుగా ఇంజినీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్నాను. ఉద్యోగం పర్మనెంట్ అవుతుందనే ఆశతో జీవితం నెట్టుకొస్తున్నాం. మా సమస్యలు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సివచ్చింది.

–గొర్లి మురళి, జిల్లా అధ్యక్షుడు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి..



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. రూ.15 వేలు వేతనం కాగా కేవలం రూ.13,080లు మాత్రమే చేతికి అందుతుంది. ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.

– మాకిరెడ్డి అప్పలనాయుడు, నర్సీపట్నంశాఖ ప్రెసిడెంట్

తాగునీటి సమస్యపై ఎంపీడీవోకు వినతి

నర్సీపట్నం : గన్నవరం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకులు అప్పన్న, ఎస్.ఎస్.జి.దొరబాబు పార్టీ నాయకులతో నాతవరం ఇంచార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్న నర్సీపట్నం ఎంపీడీవో ఉషశ్రీని కోరారు. తను స్వయంగా పరిశీలన చేసి రెండు రోజుల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో హామీ ఇచ్చారని దొరబాబు తెలిపారు.

రేపటి నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

మాకవరపాలెం : వృద్ధులు, దివ్యాంగులకు ఈ నెల 26 నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ బి.వెంకటరమణ డీలర్లకు సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇకపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల 26 నుంచి 30వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు తీసుకువెళ్లి అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ కె.నూకరాజు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

మాడుగుల రూరల్ : మండలంలో ఈ నెల 26 వ తేదీ నుంచి వచ్చే నెల 10 వ తేదీ వరకు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్టు మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాల్లోని పశుసంవర్ధక సహాయకులను సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులకు సత్కారం

మాకవరపాలెం: బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు ఘన సత్కారం చేశారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సంతోషి, లోవరాజు బదిలీఅయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాల హెచ్‌ఎం భీమారావు, ఉపాధ్యాయులు సత్కరించి వీడ్కోలు పలికారు.

వేతనాల కోసం విజ్ఞప్తి



గుడ్డిపలో గ్రీన్ అంబాసిడర్ల మొర

రావికమతం: ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వక అర్థాకలితో అలమటిస్తున్నామని గుడ్డిప గ్రామ గ్రీన్ అంబాసిడర్లు మండల పరిషత్ ఈవో పీఆర్‌డీ స్వామి వద్ద బుధవారం మొరపెట్టుకున్నారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్మికులు తమకు వేతనాలు మంజూరు చేయాలని కోరారు. రికార్డులు పరిశీలించి వేతనాలు ఆలస్యానికి కారణాలు తెలుసుకొని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మోడల్ స్కూల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చీడికాడ : మంచాల మోడల్ స్కూల్లో మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 6, 7, 8, 9, ఇంటర్, ప్రథమ సంవత్సరంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి పాఠశాలల్లో నేరుగా ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

కంటి రోగులకు పరీక్షలు

చోడవరం : లక్కవరం గ్రామంలో కంటి రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు బుధవారం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఐ విజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరిపారు. 136 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి వారిలో 48మందికి శస్త్రచికిత్సలు చేసేందుకు ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రోగ్రాం మేనేజర్ ఆరుణ్‌కుమార్, దుర్గాభవానీ పాల్గొన్నారు.

నేడు నషా ముక్త భారత్ అభియాన్

మాడుగుల: నియోజకవర్గంలో కె. కోటపాడు రామకృష్ణ కళ్యాణమండపంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో నషా ముక్తభారత్ అభియాన్ జరగనుందని, ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3.30 గంటలకు భారీ బహిరంగ సభ, ర్యాలీ కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ, సిబ్బంది, వెలుగు సిబ్బంది, ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు, 8,9.10, తరగతులు విద్యార్థులు, విధిగా హాజరు కావాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

రావికమతం : కొత్తకోటలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో మేడివాడకు చెందిన వైఎస్సార్ పార్టీ నాయకులు దివంగత పతివాడ చిన్నంనాయుడు కుమారుడు ధనంజయ్ ఆధ్వర్యంలో కొత్తకోటలో బుధవారం ఉచిత నేత్ర శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి 32 మందికి వైద్యులు పావని, కావ్య నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 19 మందికి ఆపరేషన్ అవసరం అని గుర్తించారు. వారిని వేంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు.